నిరుపేద విద్యార్థులకు బాసటగా ఉంటాం



పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తున్న లీలా పూనంవాలా

నిజాంపేట్: ఇంజినీరింగ్ విద్యనభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ ఆర్థికంగా బాసటగా నిలుస్తుందని లీలా పూనం ఫౌండేషన్ చైర్‌పర్సన్, పద్మశ్రీ లీలాపూనం వాలా అన్నారు. బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో 136 మంది పేద విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా లీలాపూనం వాలా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నాలుగేళ్ల పాటు ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసేందుకు ఒక్కొక్కరికీ రూ.60 వేల స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీడీ నాయుడు, ఫౌండేషన్ ట్రస్టీ ఫిరోజ్ పూనంవాలా, కళాశాల డైరెక్టర్ చెన్నకేశవరావు, సీఈవో సుంజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక శబ్దంతో డీజే ప్లే.. బార్‌పై కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: అధిక శబ్దంతో డీజే ప్లే చేసిన మంజీరామాల్‌లోని కింగ్– క్వీన్‌బార్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జేఎన్టీయూ రోడ్డులోని మంజీరామాల్‌లో గల కింగ్–క్వీన్ బార్ నుంచి శుక్రవారం రాత్రి డీజే సౌండ్ అధికంగా వస్తుదంటూ స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న గోపీకృష్ణ అక్కడికి చేరుకుని డీజేను ఆఫ్ చేయాలని సూచించాడు. అతని మాటను ఖాతారు చేయకుండా ఇంకా సౌండ్ పెంచారు. గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదును చూసి వదిలేసి..!

ప్రగతినగర్‌లో ఇళ్ల మధ్యే కెమికల్ పరిశ్రమలు

- రాత్రయితే చాలు గాల్లోకి విష వాయువులు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- పట్టని అధికారులు, పాలకులు
- ఇక్కడి నుంచి తరలించాలని స్థానికుల డిమాండ్



ప్రగతినగర్ ఎలీప్ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న పలు కాలనీల ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: విశాఖలో ఎల్జీ పాలీమర్స్ తరహాలోనే ప్రగతినగర్‌లోనూ ఇళ్ల మధ్య ఉన్న ఫ్యాక్టరీలతో ప్రమాదం పొంచి ఉన్నది. ప్రతిరోజూ చీకటి పడితే చాలు నెమ్మదిగా విష వాయువులను గాల్లోకి వదులుతూ లక్షలాది మంది ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఎలీప్ ఇండస్ట్రీయల్ ఏరియా ఉంది. ఇప్పుడు ఈ ప్రాంతం అపార్ట్‌మెంట్లు, ఇళ్లతో నిండిపోయింది. ప్రగతినగర్, నిజాంపేట ఏరియాలో దాదాపు లక్షన్నర మంది ప్రజలు నివసిస్తున్నారు. ఎలీప్ ఏరియాలో ఉన్న ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా విషవాయువులను గాలిలోకి వదిలేస్తుండడంతో అటు గాజులరామారం, ఇటు నిజాంపేట, బాచుపల్లి చివర వరకు వ్యాపిస్తున్నాయి. దీంతో వీటి పరిధిలో ఉండే దాదాపు రెండు లక్షల మంది తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు.

విష వాయువులు పీల్చి తీవ్ర అస్వస్థత..

ఇటీవల ఓ కంపెనీ వదిలిన విష వాయువును పీల్చి పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. కంపెనీ సమీపంలో ఉండే ఇళ్లల్లోని వారిలో ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. కొందరు వాంతులు చేసుకుంటూ ఆస్పత్రికి వెళ్లిన పరిస్థితి వచ్చింది. ఎన్–95 మాస్క్‌లు ధరించినా ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. అర్ధరాత్రి వరకు సదరు ఫ్యాక్టరీ విష వాయువును వదలడంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా వారు స్పందించకపోవడం గమనార్హం.

కంపెనీ ఎదుట స్థానికుల ధర్నా

విష వాయువు వదులుతున్న కంపెనీ ఎదుట మహిళలతో సహా స్థానికులు ధర్నా చేపట్టారు. తక్షణమే కంపెనీని మూసేయాలని, మిగిలిన ఫ్యాక్టరీలను కూడా ఇక్కడి నుంచి తరలించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది వచ్చి గాలిలో నాణ్యత పరిశీలించగా విషవాయువులు ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయినా అధికారులు మాత్రం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు.

భూమిలోకి ఫ్యాక్టరీ వ్యర్థాలు

ఎలీప్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని ఫ్యాక్టరీలు కెమికల్ వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఓ ఫ్యాక్టరీ ప్రాంగణం ఏకంగా డ్రైనేజీలా మారిపోయింది. ఇక్కడున్న ప్రతి ఫ్యాక్టరీలోనూ దాదాపు ఇదే పరిస్థితి. కెమికల్ వ్యర్థాలు భూమిలోకి ఇంకడం వల్ల ప్రగతినగర్ ఏరియాలో భూగర్భ జలాలు సైతం పూర్తిగా కలుషితమై చర్మ సమస్యలు ఎక్కువయ్యాయి. దీంతోపాటు జుట్టు ఊడిపోవడం, నరాల బలహీనత వంటి ఇతర సమస్యలను స్థానికులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలీప్‌లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలను మూసేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పారిశ్రామికవాడ ఎదుట కాలనీవాసుల ఆందోళన

నిజాంపేట్: విషవాయువులు వదులుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతినగర్ ఎలీప్ పారిశ్రామికవాడ ఎదుట పలు కాలనీల వాసులు శనివారం సాయంత్రం 'మాకు జీవించే హక్కు లేదా..? ఎన్నాళ్లు ఇలా విషవాయువులను భరించాలి..మాకు స్వచ్ఛమైన గాలి కావాలంటూ' ప్లకార్డులు ప్రదర్శిస్తూ పీసీబీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 3 రోజులుగా విష వాయుల గాఢతకు శ్వాస అందక ఇబ్బందులకు గురవుతున్నారని, బయటకు వస్తే వాసనలు భరించలేక ఇళ్లల్లోనే తలుపులు వేసుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఆరోపించారు. పీసీబీ అధికారులు సదరు పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పీసీబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

సందర్శించిన పీసీబీ అధికారి..

ప్రజల ఆందోళన నడుమ పీసీబీ అధికారి రాజేందర్ ప్రగతినగర్ ఎలీప్ పారిశ్రామికవాడను సందర్శించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచే విష వాయువులు వదులుతున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని, మరోసారి ఎలీప్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి సదరు పరిశ్రమను గుర్తిస్తామన్నారు. గాఢతతో కూడిన వాయువులను గాల్లోకి వదులుతూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న పరిశ్రమకు నోటీసులు జారీ చేస్తామని, అవసరమైతే సదరు పరిశ్రమను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్యులతో కలిసి రోగులకు మందులు అందజేస్తున్న నగేశ్

సుభాష్‌నగర్: సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. వైద్యులు కీర్తన, శ్వేత రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జ్వరం, చర్మ సంబంధిత వ్యాధులు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బస్తీ ప్రెసిడెంట్ నగేశ్‌తో కలిసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ఓబుల్ రెడ్డి, నర్సులు సునీత, ఆశ, సన్నీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్

రంగారెడ్డినగర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఏపీహెచ్‌బీ కాలనీలో రూ.49 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్, రోడ్డు పనులను కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్లాది నిధులను వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోని అనేక కాలనీలు, బస్తీల్లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, యాదిరెడ్డి, మోహన్ లాల్, మహిళా నాయకులు తారక రాణి, ఈశ్వరి, కరుణ, ఏపీహెచ్‌బీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయికిరణ్, ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రామచంద్రరావు, జగన్మోహన్‌రావు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..

పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రూ.3.4 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గాజులరామారం ప్రాంతానికి చెందిన రఫత్ ఉన్నిసా బేగం (రూ.లక్ష), జగద్గిరిగుట్ట రింగ్‌బస్తీకి చెందిన వెంకట దీక్షిత (రూ.40వేలు), కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన దేవేందర్ యాదవ్ (రూ.2 లక్షల) ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు.

సమస్యలపై విన్నపాలు..

గాజులరామారం డివిజన్ కై లాస్‌హిల్స్‌కాలనీ రోడ్డు నంబర్–2లోని ఆర్‌జేవీ హరివిల్లు అపార్ట్‌మెంట్‌వాసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. భూగర్భ డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత ఏఈతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మాధవ రావు, సురేశ్, హరికృష్ణ, నాగరాజు, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

రైతుల భూములను లాక్కుంటే సీఎంకు కేసీఆర్ గతే

రైతులతో సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: 'అసైన్డ్ భూములు మీ తాత జాగీరు కాదని.. రైతుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే సీఎం రేవంత్ రెడ్డికి పడుతుందని' మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ గ్రామంలో సర్వే నంబర్ 453, 454లోని 410 ఎకరాల లావానీ పట్టా భూములను ప్రభుత్వం తీసుకునేందుకు యత్నిస్తున్న విషయమై రైతులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను బెదిరించి 40 ఎకరాల భూమిని తీసుకుని వారికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా డబుల్ బెడ్రూంలు నిర్మించిందన్నారు. ఇప్పుడు అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 40 ఏళ్లుగా వ్యవసాయంపైనే ఆధారపడిన రైతుల భూములను బలవంతంగా లాక్కునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని, 2019 ఎన్నికల్లోనూ లావానీ భూమికి పట్టాలు ఇస్తామని వాగ్దానాలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఇదే సర్వే నంబర్లలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 600 మందికి 60 గజాల ఇందిరమ్మ పట్టాలు కూడా ఇచ్చారని, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ భూమికి పట్టాలు ఇప్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీనిచ్చారు. అసైన్డ్ భూములను ఇష్టం వచ్చినట్లు తీసుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వానికి అవసరమైతే నష్టపరిహారం చెల్లించి భూములు తీసుకోవాలని, సూచించారు. పోలీసులతో రైతులను బెదిరించాలని చూస్తే ఊరుకునేది లేదని, హైకోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఈటల భరోసా ఇచ్చారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, దుండిగల్ ప్రాంత రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి: కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని బిల్లులు చెల్లించలేని పేదవారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందవచ్చని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూసాపేట డివిజన్‌కు చెందిన ఎండీ ఫక్రుద్దీన్‌కు మంజూరైన లక్ష రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యురాలికి ఎమ్మెల్యే అందజేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఎండీ సాబేర్ అలీ

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎండీ సాబేర్ అలీ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సౌజన్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో సాబేర్ అలీని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం

కూకట్‌పల్లి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా, ఏ ఎన్నికలు అయినా బీఆర్ఎస్‌దే గెలుపు ఖాయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని వివరించారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగెత్తారని అన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబురావు, అధ్యక్షులు సీహెచ్. ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని మంత్రికి వినతి



రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు నిలిపి వేసిన విషయమై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్లాట్లకు సంబంధించి అనుమతులతో పాటు సంబంధిత ధ్రువీకరణపత్రాలు సక్రమంగా ఉన్నా, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో ఫోన్లో మాట్లాడారు. యధావిధిగా రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటానని, ప్రజలు ఆందోళనకు గురి కావొద్దని మంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఆయన వెంట దుర్గారావు, అప్పారావు, వెంకట రమణయ్య, ఓబుల్ రెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

'బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు'

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి శుభం హోటల్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల బీజేపీ పాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటాయని, పెట్రోల్, డీజిల్, కూరగాయాలు, పప్పు దినుసులు ఇలా అన్నీ పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, దేవదానం, సత్యం, స్వాతి, జాకీర్ హుస్సేన్, కరుణాకర్, వెంకన్న, మల్లారెడ్డి పాల్గొన్నారు.



షాపూర్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

కొనసాగుతున్న గ్రూప్ 1 పరీక్షలు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1 పరీక్షలు శనివారం 6వ రోజు ప్రశాంతంగా జరిగాయి. 114 మంది దివ్యాంగులు, నలుగురు ఇతరులు మొత్తం 118 మంది పరీక్షలు వ్రాయాల్సి ఉండగా.. 92 మంది హాజరయ్యారు. 26 మంది హాజరు కాలేదని అధికారులు తెలిపారు. ఆదివారం చివరి పరీక్ష ఉంటుంది.

ఇక నగరం నలుమూలలా పరిశ్రమలు

ఐటీ పార్కుల విస్తరణపై సర్కారు దృష్టి


- ప్రభుత్వ భూముల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు
- పారిశ్రామిక వాడల టార్గెట్‌పై సర్కారు ఫోకస్

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వందలాది పరిశ్రమలతో వందలాది మంది నిరుద్యోగులకు, ప్రత్యక్షంగా వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించిన సర్కారు హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పాటు మహానగరం నలువైపులా పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. శివారుల్లో ఇప్పటికే గ్రీడ్ పాలసీలో భాగంగా గత ప్రభుత్వం ఉప్పల్ జెన్‌ప్యాక్ వద్ద 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కుకు శ్రీకారం చుట్టింది. నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసింది. వీటిని వేగవంతం చేయడంతో పాటు నగరానికి తూర్పు దిశలో ఘట్కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రీయల్ పార్కు స్థాపనకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ భూముల వివరాలపై సర్కారు ఆదేశాలతో అధికార యంత్రాంగం... శివారు జిల్లాల్లో గుర్తించే పనిపై నిమగ్నమైంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల గుర్తింపుపై చర్యలకు ఉపక్రమిస్తోంది.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో...

పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించటంతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే సౌకర్యం, నీటి సరఫరా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి సూచించింది. ఆ దిశగా చర్యలకు ముందడుగు వేస్తోంది. కొండలు, గుట్టలు అటవీ భూములు కాకుండా ఇతర భూములను ఎంపిక చేయాలని కోరటంతో పాటు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే ప్రైవేట్ భూములను కూడా గుర్తించి, వాటి బహిరంగ మార్కెట్ ధర, ప్రభుత్వ ధరలను తెలపాలని పేర్కొనడంతో ఆమేరకు చర్యలు చేపడుతోంది. స్థానికంగా ఉన్న వనరుల వివరాలతో పాటు ఏయే పరిశ్రమలకు సంబంధిత భూములు, ప్రాంతాలు అనువుగా ఉంటాయన్న విషయాలను నివేదికలో పొందుపరిచేందుకు సిద్ధమవుతోంది. భూములను గుర్తించిన తర్వాత ఆయా ప్రాంత చిత్రాలు (లోకేషన్ మ్యాప్‌లు) తయారు చేసి రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ)కి పంపించాలని నిర్దేశించడంతో అందుకు అనుగుణంగా కార్యాచరణకు వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వేలో రెవెన్యూ యంత్రాంగం తలమునకలైనట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూముల లెక్క ఇలా ..



మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల గుర్తింపుపై ఆరా తీస్తున్న రెవెన్యూ యంత్రాంగం 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్క తేల్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి? సంరక్షణలో ఎన్ని ఉన్నాయి? అన్న అంశాలను తేల్చేందుకు సమగ్ర సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. మేడ్చల్ జిల్లాలో బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో దాదాపు 30 శాతానికి పైగా భూములు కబ్జాకు గురైనట్లు అంచనా వేస్తున్న రెవెన్యూ శాఖ సమగ్ర సర్వేపై దృష్టి సారిస్తోంది.

అసైన్డ్ భూములిలా ..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలపై కూడా రెవెన్యూ యంత్రాంగం కన్నేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2004 వరకు ప్రభుత్వ భూములను ఎంత మందికి అసైన్డ్ చేశారనే విషయాలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దష్టి సారిస్తోంది. మేడ్చల్ జిల్లాలో 116 గ్రామాలకు చెందిన 8, 230 మంది నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ కుటుంబాలకు 11, 384 ఎకరాల ప్రభుత్వ భూములను వ్యవసాయం (పంట సాగు), ఇళ్ల స్థలాల కోసం అసైన్డ్ చేశారని గుర్తించిన అధికార యంత్రాంగం మండలాల వారీగా సంబంధిత వివరాలపై ఆరా తీస్తోంది. అందులో భాగంగా ఘటేస్కర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలం 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలం 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలం 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలం 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలం 18 గ్రామాల్లో 855 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అసైన్డ్ భూములకు సంబంధించి నోటరీ క్రయ విక్రయాలు చాలా మేరకు జరగగా.. అనేక సంస్థలు వెలసినట్లు సమాచారం. అలాగే వందలాది ఎకరాల భూములు కూడా అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన అధికార యంత్రాంగం ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా రోడ్డు ఆక్రమణ..!

- రహదారికిరువైపులా తుక్కు సామగ్రి డంపింగ్
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ఐలా, మున్సిపల్ అధికారులు



రోడ్డుపై తుక్కు అన్‌లోడింగ్ చేస్తుండడంతో నిలిచిన వాహనాలు

జీడిమెట్ల: ఏస్వీ కోఆపరేటివ్ సొసైటీ వద్ద రోడ్డును కొంతమంది తుక్కు వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. రోడ్డుకిరువైపులా తుక్కు సామాగ్రిని డంప్ చేస్తుండడంతో వాహనాదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు ఏస్వీ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్లకిరువైపులా పెద్ద ఎత్తున డంపింగ్..

ఏస్వీ కోఆపరేటివ్ సొసైటీ నుంచి వెంకటాద్రినగర్ వచ్చే రోడ్డులో కొంతమంది అనుమతులు లేకుండానే గోదాములు ఏర్పాటు చేసి తుక్కు సామాను వ్యాపారం నిర్వహిస్తున్నారు. కాగా వీరు వివిధ పరిశ్రమల్లో ఉన్న పాత సామాన్లు కొనుగోలు చేసి లారీల్లో ఇక్కడికి తీసుకువస్తారు. వారి గోదాముల్లో సరిపడా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే అన్‌లోడింగ్ చేసి దాదాపు రోడ్డును 10 ఫీట్ల మేర ఆక్రమిస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు ఎదురుగా వచ్చినపుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా డంప్ చేసిన తుక్కు సామాగ్రిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.